# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 281
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఆగస్టు 14, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## ఇందిరమ్మ ఇళ్లలో కమీషన్ల వివాదం

- లబ్ధిదారుడిపై కాంగ్రెస్ నాయకుల దాడి
- ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితుడు

8లో..

# చెప్పేది ఫ్లడ్ వాచ్.. చేసింది వైన్ వాచ్

వివరాలు2లో..





- డిజాస్టర్ టీంలో ఆల్కహాల్
- పల్లీ, పకోడీతో ఎంజాయ్
- మందు తాగి మజా చేసిన అధికారులు
- పోలీసుల రంగప్రవేశంతో ఆఫీసర్స్ పరార్

చెప్పేవి శ్రీరంగనీతులు.. దూరేవి దొమ్మరి గుడిసెలు అన్న చందంగా మారింది ఇరిగేషన్ శాఖ అధికారుల పనితీరు. భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతుంటే అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు మందు తాగుతూ మజా చేయడం వివాదాస్పదంగా మారింది. డోర్నకల్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఇందుకు వేదికగా మారింది. వరదలతో డోర్నకల్ ప్రాంతంలోని చెరువులు, కుంటలకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా 24 గంటలు ఫ్లడ్ వాచ్ నిర్వహించాల్సిన ఉన్నతాధికారి తన విధులను మరిచి కింది స్థాయి ఉద్యోగితో కలిసి మందు తాగుతూ పల్లీ, పకోడి తింటూ ఎంజాయ్ చేయడంపై జనం మండిపడుతున్నారు. అయితే ఈ విషయం ఆనోట.. ఈ నోట పోలీసుల చెవికి చేరింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కార్యాలయంపై దాడి చేశారు. అక్కడి పరిసరాలను పరిశీలించడంతోపాటు మద్యం సేవించిన అధికారులను బ్రీత్ ఎనలైజర్ తో పరీక్షించేందుకు సిద్ధపడగా ముగ్గురు అధికారులు అక్కడినుంచి పరారయ్యారు. -వరంగల్ వాయిస్, డోర్నకల్



8లో..

## అటవీ భూమి అమ్మకంపై డీఎఫ్ఓ విచారణ

- స్థానిక అధికారులపై సీరియస్
- ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలంటూ ఆదేశం



8లో..

## కాంగ్రెస్ అంటేనే కరువు

- స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి
- గీసుగొండలో మాజీ మంత్రి హరీష్ రావు




8లో..

## ఉప్పొంగిన దేశ భక్తి

- నగరంలో 75 అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ
- వర్షంలోనూ ఉత్సాహంగా సాగిన యాత్ర

# చెప్పేది ఫ్లడ్ వాచ్.. చేసింది వైన్ వాచ్

- డిజాస్టర్ టీంలో ఆల్కహాల్
- పల్లీ, పకోడీతో ఎంజాయ్
- మందు తాగి మజా చేసిన అధికారులు
- పోలీసుల రంగప్రవేశంతో ఆఫీసర్స్ పరార్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. మరో రెండు, మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో పాటు రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సైతం హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉధృతితో గత ఏడాది తీవ్ర విషాదాన్ని మిగిల్చిన మున్నేరు వాగు, ఆకేరు నది పరిసర ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి హానీ జరుగకుండా చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అదేశించారు. డోర్నకల్ గురించి ప్రత్యకంగా ప్రస్తావించి జాగ్రతగా ఉండాలంటూ అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ప్రవహిస్తున్న మున్నేరు వాగు, ఆకేరు నదిపై ఆయన ప్రస్తావించారు. గత ఏడాది జరిగిన రోడ్ల డ్యామెజీ, ఆస్తి నష్టంతో పాటు సైంటిస్ట్ అశ్విని, ఆమె తండ్రి మోలిలాల్ మృతిని గుర్తు చేశారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంత కలెక్టర్లు, ఇతర ఉన్నత స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. మరోపక్క పోలీసులు సైతం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

### సోయిలేని అధికారులు..

ప్రకృతి వైపరిత్యాలు జరిగే అవకాశం ఉన్న ఈ సమయంలో డోర్నకల్ మండలంలో ప్రవహిస్తున్న మున్నేరుతో పాటు చెరువులు, కుంటలు పరిశీలించాల్సిన ఇరిగేషన్ అధికారులు ఫ్లడ్ వాచ్ డ్యూటీ చేయల్సింది పోయి వైన్ వాచ్ డ్యాటీలో మునిగితేలారు. వరద ప్రభావాన్ని అంచనా వేస్తూ పై అధికారులకు విషయాన్ని తెలిపి అందుకు అనుగుణంగా కింది స్థాయి అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన అధికారులు హాఫ్ బాటిల్ హండ్రెడ్ పైపర్ మందుతో ఔట్ ఆయ్యారు.

### వేదికైన ఇరిగేషన్ కార్యాలయం..

డోర్నకల్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంగా చెప్పుకునే ఓ భవనంలోని రెండు గదులు ఇందుకు వేదికగా మారాయి. డోర్నకల్ మండల ఇరిగేషన్ బ్రాంచి డీఈ బద్రు నాయక్ బుధవారం సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. ఆయనతో పాటు మానుకోట క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు. కార్యాలయానికి పెద్ద అధికారి రావడంతో ఆయనకు మర్యాద చేసి తరించేందుకు అదే శాఖలో విధులు నిర్వహిస్తున్న మరో అధికారి రంగం సిద్ధం చేశారు. ఆయనే స్వయంగా మెయిన్ రోడ్ లోని వైన్స్ షాపుకు చేరుకొని హండ్రెడ్ పైపర్ రెండు క్వార్టర్ బాటిల్లు కొనుగోలు చేశారు. మందుతోపాటు నాలుగు గ్లాసులు, లీటర్ వాటర్ బాటిల్, స్టఫ్ గా బాయిల్డ్ పల్లీ, పకోడి సంకలో పెట్టుకొని సందు నుంచి సక్కగా గుసాయించి మెయిన్ రోడ్ లోని ఆఫీస్ కు చేరుకున్నారు. ముగ్గురూ కలిసి 30 నిమిషాలపాటు మద్యం సేవిస్తూ మజా చేశారు. వారితో తెచ్చుకున్న తెల్ల ప్లాస్టిక్ కవర్లో వాడేసిన గ్లాసులు, మందు బాటిల్లను వేసి పక్కనే ఉన్న సింకులో డ్రైవర్ తో పెట్టించారు.

### పోలీస్ రైడ్..

వరదల నేపథ్యంలో 24 గంటలు అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు మద్యం సేవిస్తూ మజా చేస్తున్న విషయం పోలీసులకు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఇరిగేషన్ కార్యాలయంగా చెప్పుకునే ఆఫీస్ పై దాడి చేవారు. డీఈ, ఏఈలకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసేందుకు సిద్ధమయ్యారు. అందుకు సహకరించాలని అధికారులను కోరగా వారు ససేమీరా అన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహించాల్సిందేనంటూ కానిస్టేబుల్ పట్టుబట్టారు. ఈ విషయాన్ని ఆయన పై అధికారులకు తెలిపే క్రమంలో అధికారులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో చేసేది లేక గదుల్లో తనిఖీలు నిర్వహించారు. అధికారులు తెల్లకవర్ లో ఉంచిన ఖాళీ మద్యం బాటిళ్లు, గ్లాసులను వీడియో తీశారు. జరిగిన విషయాన్ని అక్కడికి వచ్చిన కానిస్టేబుల్ డోర్నకల్ సీఐ రాజేష్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

### అంతా పరార్..

విధుల్లో ఉండి మద్యం సేవించిన అధికారులు అక్కడి నుంచి కారులో వెళ్లిపోగా సో కాల్డ్ ఆఫీస్ తలుపులు మూసేవారే కరువయ్యారు. ఇందుల్లో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఫైల్స్, సామాగ్రి, బీరువాలు, బస్తాలలో కాగితాలకు రక్షణ లేకుండా పో..యిం..ది... ఈ ఘటనపై ఇంటిలిజెన్స్ తోపాటు జిల్లా ఇరిగేషన్ అధికారులు, జిల్లా బాస్ విచారిస్తున్నట్లు తెలిసింది. ఆఫ్టర్ ఇండిపెండెన్స్ డే చర్యలు ఉంటాయిని వినికిడి.

# మత్తుపదార్థ రహిత సమాజమే లక్ష్యం

- అమ్మకాలపై దృష్టి సారించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** మత్తు పదార్థ రహిత సమాజం కొసం అందరం సమష్టిగా పనిచేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపు నిచ్చారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సీపీ తొలుత సమీక్షించారు. పెండింగ్‌కు గల కారణాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకై విద్యా సంస్థల పరిసరాలతో పాటు, నిర్మానుష్య ప్రదేశాలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు వారివారి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఈ-సిగిరెటు వినియోగంపై నిషేధం అమలులొ ఉన్నందును కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి కేసుల్లో అధికారులు ప్రధాన నిందితుల అరెస్టుకై ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు సీసీ కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మద్యం దుకాణాల్లో తప్పని సరిగి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోనే విధంగా యజమానులను అదేశించాలని. చోరీ కేసులకు సంబంధించి ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులను పట్టుకొనేందుకుగాను సీసీఎస్ పోలీస్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది యోగ క్షేమాల పట్ల అధికారులు దృష్టి సారించాలన్నారు. వారికి ఏదైన వ్యక్తిగత లేదా శాఖాపరమైన సమస్య ఉంటే సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగాం ఏఎస్పీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావుతో పాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### ఏడీసీపీ రవికి ఇండియన్ పోలీస్ మెడల్..



పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పరిపాలన విభాగం అదనపు డీసీపీగా విధులు నిర్వహిస్తున్న నల్లమల రవిని ఇండియన్ పోలీస్ మెడల్ కు ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్ నగర్ జిల్లా ఏనుగొండ ప్రాంతానికి చెందిన అడిషనల్ డీసీపీ నల్లమల రవి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి 1991 సంవత్సరంలో ఎస్ఐగా ఎంపికై శిక్షణ అనంతరం మెదక్ జిల్లాలోని శివం పేట, తుఫ్రాన్, మునిపల్లె పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా చేసి సీఐగా పదోన్నతి పొంది అమ్రాబాద్, మిర్యాలగూడ, సదాశివాపేట సర్కిల్ పోలీస్ స్టేషన్ లో పనిచేశారు. అలాగే డీఎస్పీగా సంగారెడ్డి, జహిరాబాద్, అడిషనల్ డీసీపీ కరీంనగర్ పోలీస్ ట్రయినింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ గా పని చేశారు. ముఖ్యంగా అదనపు డీసీపీ నక్సల్ ప్రాబల్యం ఉన్న పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు, సమస్యాత్మాక ప్రాంతాల్లో కూడా విజయవంతం విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్చంద సంస్థల నుంచి పలు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ మెడల్ కు ఎంపికైన అడిషనల్ డీసీపీ రవికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తో పాటు డీసీపీలు, అడిషనల్ డీసీపీ, ఏఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# వీర నాయకుల విగ్రహాల శుద్ధి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** స్వతంత్ర పోరాటంలో పాల్గొని అమరులైన వీర నాయకుల విగ్రహాలను శుద్ధి చేసే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కాశిబుగ్గలో ప్రారంభించారు. కాశిబుగ్గలోని బాలగంగాధర్ తిలక్, బీఆర్ అంబేద్కర్, వెంకట్రామా జంక్షన్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలతో అలంకరించారు. అనంతరం ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో వారికి దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీషా, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ పైర్ధి ఆనంద్, సీనియర్ నాయకుడు సముద్రాల పరమేశ్వర్, జిల్లా కార్యదర్శి బాకం హరిశంకర్, మండల అధ్యక్షుడు అపురూప సాయి, ప్రోగ్రాం మండల కన్వీనర్ కట్టర్ సతీష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, గిర్మాజీపేట మండల అధ్యక్షుడు సీతా నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, గడల కుమార్, కాసు శిల్ప ,కోమకుల నాగరాజు, కూచన క్రాంతి, నోముల రతన్, గోక వెంకటేష్ కోట సతీష్, అల్లి అజయ్ రాఘవాచారి, ప్రభాకర్, చింతనూరు రాము, నిఖిల్, చిమ్మని శ్రీకాంత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

◆ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
◆ అక్కంపేటలో మహిళా కమ్యూనిటీ హాల్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా కమ్యూనిటీ హాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో మహిళలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని, కానీ నేడు వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని ప్రశంసించారు. పరకాల నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా డైరీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రూ. 32 కోట్ల భాగస్వామ్యంతో మహిళా డైరీని ఏర్పాటు చేసి, మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, అభివృద్ధి, సంక్షేమాన్ని ఆశీర్వదించాలని కోరారు. అక్కంపేట గ్రామానికి తాను ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ గ్రామాన్ని రెవెన్యూ విలేజ్‌గా మార్చారని గుర్తు చేశారు. డిజిటల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, గ్రామానికి హెల్త్ సెంటర్ మంజూరైందని, రూ. 50 లక్షలతో సీతారామస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన వివరించారు.

## 'నానో ఎరువులు లాభదాయకం'




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వ్యవసాయంలో నూతన ఒరవడిని సృష్టిస్తున్న నానో ఎరువులు రైతులకు లాభదాయకమని నిపుణులు పేర్కొన్నారు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దాబాలో ఇఫ్కో (IFF-CO) ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఈ అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నానో యూరియా, డీఏపీ, కాపర్, జింక్ వంటి నానో ఎరువుల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్.ఎ.ఆర్.ఎస్, ఏ.డీ.ఆర్ డా. రావుల ఉమారెడ్డి, డీ.ఏ.ఓ అనురాధ, ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్ మాట్లాడుతూ నానో సాంకేతికతతో తయారుచేసిన నానో యూరియా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని, అధిక దిగుబడిని ఇస్తుందని తెలిపారు. ప్రతి రైతు నానో ఎరువులను ఉపయోగించుకుని లబ్ధి పొందాలని వారు కోరారు.

## దేశంపై యువతకు భక్తిశ్రద్ధలు ఉండాలి




**వరంగల్ వాయిస్, వరంగల్:** దేశభక్తిని, జాతీయ భావనను పెంపొందించాలనే లక్ష్యంతో ఏవీవీ కళాశాల విద్యార్థులు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ఎంజీఎం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో హోరెత్తించారు. యువతతో పాటు ప్రజలందరిలో దేశభక్తి భావనలను ప్రేరేపించేలా ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ అధికారి, నేటి యువత వినోదం, ఆనందంపై ఎక్కువ దృష్టి పెడుతూ దేశం, సమాజం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రేపటి గణతంత్ర దినోత్సవం సందర్భంగా యువతలో జాతీయ భావన, దేశభక్తిని పెంపొందించడం, సైనికుల త్యాగాలను గుర్తు చేయడం, దేశం పట్ల విధేయతతో ఉండేలా ప్రోత్సహించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్. అనిత, డాక్టర్ శ్రీధర్, కళాబృందం సభ్యులు చిరంజీవి, రమేష్, శివ, సీనియర్ వలంటీర్లు సాత్విక్, దేవిశ్రీప్రసాద్, క్రాంతి, సాకేత్, చిరంజీవి, దస్తగిరి, సాయి హర్షిత్, సాదియాఫర్హిన్, షాజహాన్ మహీన్, సన, మన్విత తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, విజయవాడ :** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మేనల్లుడు పవన్ రాజ్, సాయి శృతిల వివాహ వేడుక విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అనేక మంది ప్రముఖ రాజకీయ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ వివాహ వేడుకలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణ రావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, వివేక్ వెంకటస్వామి వంటి ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వాకాటి శ్రీహరి, తూర్పు జగ్గారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఏపీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రవిబాబు, ఆడెం రాజ్, ఈర్ల కొంరయ్య, జివియస్ చారి, కూన శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షులు బొంతు రాంమోహన్, మైనారిటీ నాయకులు మాజిద్, యూత్ కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్, ఐఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలి

తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. పట్టణాలు, గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీరు చేరిందని, దీంతో బియ్యం, బట్టలు, నిత్యావసర వస్తువులు పూర్తిగా తడిసిపోయి ప్రజలు సర్వం కోల్పోయారని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడు శాశ్వత పరిష్కారాలు చూపుతామని చెప్పి, తర్వాత అధికారులు వాటిని విస్మరించడం సర్వసాధారణంగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా వరదల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యం, రూ. 25 వేల నగదు, బట్టలు, బెడ్‌షీట్లు వంటి అత్యవసర వస్తువులను యుద్ధ ప్రాతిపదికన ఉచితంగా అందించాలని కోరారు. ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం అందించాలని ఆయన పేర్కొన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సదుపాయాలు కల్పించాలని వెంకట్రాములు తన ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐనవోలు మండలం కొండపర్తి గ్రామంలోని ఆదర్శ ఫంక్షన్ హాల్‌లో గుగ్గిళ్ల సాంబయ్య–సరోజన దంపతుల కుమారుడు రాజు, కావ్య వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హాజరయ్యారు. నవ వధూవరులను ఆశీర్వదించి వారికి కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బడుగు రాము, గుగ్గిళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలి

◆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున




**వరంగల్ వాయిస్, నిజామాబాద్:** తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) ఆరోపించింది. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో బోధన్ డివిజన్‌లోని వివిధ విద్యార్థి సంఘాల నుంచి ఏఐఎఫ్‌డీఎస్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాలోతు జబ్బర్ నాయక్ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ, విద్యా సంస్థలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు చాలా హాస్టల్, పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయని, అవి కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే శిథిలమైన భవనాలను కూల్చివేసి కొత్తవి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ. 8,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందజేయాలని, ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాలోతు జబ్బర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. సంఘంలో కొత్తగా చేరిన వారిలో సగ్గు నాగేంద్ర, బి.శశాంక్, షేక్ షహీన్, గణేష్ శివ శంకర్, బెంజిమెన్, భగత్ సింగ్, రవి, సందీప్, రాజేష్, షఫీ, అరుణ్, వరుణ్, సాయిల్, నవీన్, సందీప్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

# లబ్ధిదారులకు త్వరితగతిన ఇళ్లు అందజేయాలి

**◆ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అర్హులైన ప్రతి దివ్యాంగ లబ్ధిదారుడికి రెండు పడక గదుల ఇళ్లను త్వరగా కేటాయించాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మరమ్మతు పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసి పంపిణీకి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి శివారులో ఉన్న 6 బ్లాక్‌లలోని 70 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాన్ని ఎమ్మెల్యే నాగరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ బీ శాఖ చేపడుతున్న మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. అదేవిధంగా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన అంతర్గత రోడ్లను పరిశీలించిన అనంతరం, ప్రాంగణంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని మున్సిపల్ ఉద్యానవన అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ ప్రాంతానికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, స్థానిక కార్పొరేటర్ జన్ను శీభరాణి – అనిల్ కుమార్, ఇతర అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, వరంగల్:** వాసవి క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో ఒక నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన, 9వ తరగతి చదువుతున్న కొదుమూరి లక్ష్మి యశస్వినికి సరస్వతి పథకం కింద రూ. 5,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్ వరంగల్ అధ్యక్షుడు తోనుపునూరి వీరన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్యాల వీరమల్లయ్య హాజరయ్యారు. అతిథిగా డిస్ట్రిక్ట్ ఇంఛార్జి శ్రీరామ్ శైలజ మరియు క్లబ్ కోశాధికారి ఉప్పల వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు. విద్యార్థిని చదువుకు అండగా నిలిచిన వాసవి క్లబ్ సభ్యులను అందరూ అభినందించారు.

# చిట్యాలలో జాతీయ జెండాల పంపిణీ



**వరంగల్ వాయిస్, చిట్యాల:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'హర్ ఘర్ తిరంగా' యాత్రలో భాగంగా చిట్యాల మండల కేంద్రంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క భారతీయ పౌరుడు జాతీయ భావంతో, దేశ సంస్కృతిని కాపాడాలనే సంకల్పంతో పనిచేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు గుండ సురేష్, రాష్ట్ర నాయకులు నరసయ్య, తీగల వంశీ, కేంసరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు.

# హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**వరంగల్ వాయిస్, దామెర:** మండలం పరిధిలోని ఓగ్లాపూర్ సోషల్ వెల్ఫేర్, బీసీ, మైనర్ వెల్ఫేర్ హాస్టల్‌లను తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, ఇతర సౌకర్యాల గురించి ఆమె సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావార్ సంపత్ గారు కూడా పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందించాలని తహశీల్దార్ అధికారులకు సూచించారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు మహేందర్ చేయూత

## పాఠశాలకు రూ. 2.5 లక్షల ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, ఖిలాషాపురం :** విద్యార్థుల చదువుకు అండగా నిలవడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటిచెప్పేలా ఖిలాషాపురం మండల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థుల కోసం దాతృత్వాన్ని ప్రదర్శించారు శ్రీ సిద్ధి మహేందర్. గత సంవత్సరం 44 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 185 మంది విద్యార్థులు చేరడంతో, తరగతి గదుల కొరత తీవ్రంగా ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు స్వయంగా ముందుకు వచ్చి కొత్త గదుల నిర్మాణానికి శ్రమించడం ప్రారంభించారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలిసి శ్రీ సిద్ధి మహేందర్‌ను కలిసి ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కోరారు. వారి విజ్ఞప్తికి స్పందించిన మహేందర్, పెద్ద మనసుతో రెండు కొత్త గదుల నిర్మాణానికి సరిపడా రూ. 2,50,000/– ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అంతేకాకుండా, విద్యార్థులు కూర్చోవడానికి వీలుగా రెండు గదులకు సరిపడా 20 బెంచ్‌లను కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ "విద్యార్థి దశ చాలా ముఖ్యమైనది. చదువు విలువ తెలిసిన ప్రతి ఒక్కరూ పిల్లల భవిష్యత్తు కోసం చేయూత అందిస్తారు" అని అన్నారు. సిద్ధి మహేందర్ కుటుంబానికి మండల ప్రాథమిక పాఠశాల, తల్లిదండ్రులు, ఖిలాషాపురం గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలేటి యాదవరెడ్డి, తల్లిదండ్రులు మీసాల వీరన్న, కాయితాల రాజమౌళి, పుప్పాల ఉదయ్, అవుదొడ్డి మహేష్ పాల్గొన్నారు.

# గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** కాశిబుగ్గలో గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాల వేదిక నిర్మాణ పనులను గురువారం వర్తక సంఘం అధ్యక్షులు గుండేటి కృష్ణమూర్తి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండేటి కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం పూజ అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని, ఈ సంవత్సరం కూడా కార్యవర్గ సభ్యుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వడిచర్ల సదానందం, మండల శ్రీరాములు, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, గుల్లపల్లి రాజ్ కుమార్, డాక్టర్ గోనె జగదీశ్వర్, బిట్ల చక్రపాణి, ఓరుగంటి కొమరయ్య, వంగరి లింగయ్య, మాటేటి విద్యాసాగర్, గుత్తికొండ నవీన్, బండారి శ్రీనివాస్, కుసుమ నగేష్, బోడకుంట్ల వైకుంఠం, కందగట్ల రాజు, గుండు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ప్రతి సంవత్సరం ఉత్సవాలకు సేవలందిస్తున్న లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శి మండల సురేష్, దుస్స కృష్ణ, దాసి శివకృష్ణ, మండల చందు, పసునూటి శ్రీకాంత్, క్యాతం రవీందర్, బండారి భాస్కర్, క్యాతం శ్రీనివాస్, బండారి రాజు, గాజుల రాజేష్, సిందం కృష్ణ, కోడం శరత్, కానుగంటి పవన్, బండారి లక్ష్మణ్, చిలగాని రమేష్, దాసరి దేవేందర్, ముడుతనపల్లి శ్రీనివాస్, గాదె సతీష్, వంగ ఐలయ్య తదితరులు కూడా పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సీఐ కార్యాలయం ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం:** గణపురం మండల ప్రజలకు పోలీసుల సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన సీఐ కార్యాలయాన్ని గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ జెన్‌కో, సింగరేణి గనులతో గణపురం మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం గణపురంలో సీఐ కార్యాలయం అవశ్యకతను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దీని మంజూరుకు కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గణపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నివాస భవనాలు, కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను కోరారు. భూపాలపల్లిలో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు, అలాగే పారిశ్రామిక కేంద్రమైన చిల్పూర్‌ను మునిసిపాలిటీగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గణపురం మండలాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని కలిసి విన్నవించానన్నారు. దీనివల్ల రేగొండ మండలం పాండవుల గుట్టలు, కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మైలారం సున్నం గుహలు, గణపురం కోటగుళ్లు, రెడ్డి గుడి, ఘనసముద్రం వంటి పర్యాటక ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని అన్నారు. గణపురం నుంచి ధర్మారావుపేట మీదుగా భూపాలపల్లి రోడ్డును కూడా మంజూరు చేయించానని, గాంధీనగర్ గుట్టపై పనులు చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు. అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ ఏ.సంపత్ రావు, గణపురం నూతన సీఐ కరుణాకర్ రావు, చిట్యాల సీఐ మల్లేష్, గణపురం ఎస్ఐ ఆర్.అశోక్, రేగొండ, గోరికొత్తపల్లి ఎస్ఐలు, గణపురం తహసీల్దార్ ఎం.సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్.రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జి.కృష్ణయ్య, సొసైటీ చైర్మన్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ నేతలు డి.శంకరయ్య, వి.నారాయణ, ఎం.శివశంకర్, ఎండీ.చోటే మియా, ఓ.కృష్ణ, కె.శ్రీను, రామచంద్రయ్య, డి.దుర్గయ్య పాల్గొన్నారు.

# ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్న బ్యాంకు

- కెనరా బ్యాంకుపై కస్టమర్ల ఆగ్రహం
- అధ్వానంగా సేవలంటూ ఫిర్యాదులు




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు**: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు సేవలపై ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం, సేవలందించడంలో జాప్యం కారణంగా ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. బ్యాంకు లావాదేవీల కోసం వస్తే రోజంతా క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తుందని, పని అవుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొందని వివిధ గ్రామాల ఖాతాదారులు మండిపడుతున్నారు.

## సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు..

ఆత్మకూరు కెనరా బ్యాంక్ ఆత్మకూరుతో పాటు ఇతర మండలాలలోని గ్రామాలను కూడా దత్తత తీసుకోవడంతో రోజు భారీ సంఖ్యలో ఖాతాదారులు వస్తుంటారు. అయితే, వారికి సేవలు అందించడంలో బ్యాంక్ వెనుకబడి ఉందని ఆరోపణలు వస్తున్నాయి. చెల్లింపులు, రెన్యూవల్స్, విత్‌డ్రాలు వంటి పనుల కోసం వెళ్తే సిబ్బంది ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టేస్తూ ఖాతాదారులను అయోమయానికి గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. చాలామంది సిబ్బంది రోజంతా సెల్ ఫోన్‌లలో గడుపుతూ ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా, గ్రామాల నుంచి వచ్చే ఖాతాదారులను ఈసడించుకుంటూ, లోకువగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోన్ల రెన్యూవల్స్ కోసం వచ్చినవారిని 'ఇప్పుడు రా, అప్పుడు రా' అంటూ రోజులకు తరబడి తిప్పుకుంటున్నారని, దీనిపై ప్రశ్నిస్తే దురుసుగా సమాధానాలు చెబుతున్నారని ఖాతాదారులు విమర్శిస్తున్నారు.

## మహిళలు, వృద్ధుల ఇబ్బందులు ..

బ్యాంకు మండల కేంద్రంలో ఉన్నప్పటికీ ఊరికి చివరగా ఉండటంతో మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఎంతో ప్రయాసకోర్చి నడిచి వెళ్లాల్సి వస్తోందని, వెళ్లిన పని కానప్పుడు వారి రోదన వర్ణనాతీతమని ఓ ఖాతాదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాతాదారులకు సేవలు అందించడానికి సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిపై బ్యాంకు ఉన్నతాధికారులు దృష్టి సారించి, బ్యాంకు పనితీరును మెరుగుపరచాలని, తక్షణమే ఊరి మధ్యలో ఒక మినీ బ్యాంకును ఏర్పాటు చేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరుతున్నారు.

# కేఎంసీ కార్మికుల సమ్మె ఉధృతం



■ అధికారుల నిర్లక్ష్యంపై సీఐటీయూ ఆగ్రహం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కాకతీయ మెడికల్ కాలేజీ అధికారులు, ప్రిన్సిపల్ నిర్లక్ష్యం కారణంగానే గత మూడు రోజులుగా కార్మికులు సమ్మె బాట పట్టారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తీవ్రంగా విమర్శించారు. దీనికి జిల్లా యంత్రాంగం, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని ఏకశిలా పార్క్ వద్ద విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న కాకతీయ మెడికల్ కాలేజీ మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లలో పనిచేస్తున్న 86 మంది కార్మికులకు రాగుల రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ, వేతనాలు చెల్లించకుండా, ఈఎస్ఐ, పీఎఫ్ గురించి పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యపై కాలేజీ ప్రిన్సిపల్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతోనే కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందని ఆయన వివరించారు. 86 మంది కార్మికులు వేతనాలు లేకుండా ఇబ్బందులు పడుతున్నా జిల్లా కలెక్టర్, మంత్రులు ఎవరూ పట్టించుకోవడం లేదని రాగుల రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వేతనాలు ఇవ్వకుండా, ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులు ఎలా పని చేయాలని అధికారులను ఆయన ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలోనే కార్మిక చట్టాలను అమలు చేయకపోతే జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని హాస్టల్ ఫండ్స్ నుంచి కార్మికులకు వేతనాలు చెల్లించాలని రమేష్ డిమాండ్ చేశారు. ఐదు రోజులలో సమస్యను పరిష్కరించకపోతే సోమవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమ్మె కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.యాదవ్ నాయక్, సీఐటీయూ మెడికల్ కాలేజీ యూనియన్ నాయకులు అల్లం రమేష్, అతీక్, ప్రశాంత్, పరమేశ్, సుమన్, రాణి, కవిత, రాజకుమారి, సునీత, ప్రకాష్, రవి, బాబు, రమేష్, రాజేష్, శ్రీనివాస్ లతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

# నెరవేరిన పేదల సొంతింటి కల

- ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి హాజరైన ప్రణవ్



**వరంగల్ వాయిస్, వీణవంక:** పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం వెల్లివిరుస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నిజమైన లబ్ధి చేకూరుస్తుందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామంలో నియోజకవర్గంలోనే మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు దేవునూరి రాజేందర్ గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సొంతిల్లు నిర్మించుకోవడానికి కృషి చేసిందని, దీనికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, నియోజకవర్గ ఇంఛార్జి ప్రణవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి మాటలు ఉద్వేగాన్ని కలిగించాయి. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోనే మొట్టమొదటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరవడం సంతోషంగా ఉందని, మంజూరైన ఇళ్లు దాదాపు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే ముగ్గు వేసి నేడు గృహప్రవేశం చేయడం 'పనిచేసే ప్రజా ప్రభుత్వం'కు నిదర్శనమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు భవిష్యత్తులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా మంజూరు చేస్తామని, వాటి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని ప్రణవ్ తెలిపారు. నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లతో పాటు, భూమి లేని నిరుపేదలకు అదనంగా మరో వెయ్యి ఇళ్లను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత రవాణా, రైతు భరోసా, బోనస్, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముంపు బాధితులు అధైర్య పడొద్దు

## డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు



**వరంగల్ వాయిస్, వరంగల్:** భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్రజలు అధైర్యపడవద్దని, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటుందని డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. గురువారం నాడు వరంగల్ నగరంలోని జలమయమైన రామ్‌మందిర్ ప్రాంత నిర్వాసితుల కోసం పోతన రోడ్డులోని మరాఠీ భవన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో అందుతున్న వైద్య సదుపాయాలు, ఇతర వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బాధితులకు బీపీ పరీక్షలు నిర్వహించగా, ఎక్కువ ఉన్న ఇద్దరిని అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రికి పంపించారు. అలాగే, జ్వరం ఉన్నవారికి మలేరియా, డెంగ్యూ టెస్టులు, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ, మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పునరావాస కేంద్రాన్ని విడిచి ఎవరూ వెళ్లకూడదని సూచించారు. ప్రజల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, ఎంజీఎం హాస్పిటల్ డాక్టర్ మేరుగు యశస్విని, పీపీ యూనిట్ సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్ఎంలు కోమల, లక్ష్మీబాయి, రాజా సులోచన, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కాళీ ప్రసాద్ రావు



**వరంగల్ వాయిస్, దామెర :** బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు దామెర మండలంలోని వివాహ వేడుకలకు హాజరయ్యారు. గురువారం నాడు ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న కుమారుడి వివాహంలో, అలాగే లాదెళ్ల గ్రామానికి చెందిన రామంచి నిరంజన్–రాధిక దంపతుల కుమార్తె వివాహ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేపీ దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పవుడాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్ గౌడ్, మండల నాయకులు ముత్యాల అర్జున్ గౌడ్, ముత్యాల సృజన్ గౌడ్, రామరాజు, బీజేవైఎం మండల సోషల్ మీడియా కన్వీనర్ ముత్యాల రాజశేఖర్, శక్తి కేంద్ర ఇన్చార్జిలు గోగుల సమ్మిరెడ్డి, గండు పరశురాం, బూత్ అధ్యక్షులు నూకల రవీందర్, నాయకులు ముత్యాల ఉమేష్, గడ్డం కార్తీక్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించినవారికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం జరిమానాలు విధించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఇద్దరి వాహనదారులకు రూ. 2,000 జరిమానా విధించారు. అదేవిధంగా, డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 22 మందికి రూ.24,000 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. సుజాత తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

# పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రైమరీ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీస్ (పీఏసీఎస్), డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ (డీసీసీబీ), తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టీజీసీఏబీ)ల మేనేజింగ్ కమిటీల పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ కో–ఆపరేటివ్ సొసైటీస్ (టీసీఎస్) చట్టం 1964లోని సెక్షన్ 32(7)(a) ప్రకారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వ్యవసాయ, సహకార (కోఆపరేటివ్.II) విభాగం జారీ చేసిన జీవో ఆర్టీ.నెంబర్.74, 2024 ఫిబ్రవరి 14 ప్రకారం, పీఏసీఎస్‌లు, డీసీసీబీలు, టీజీసీఏబీలకు ఎన్నికైన ప్రస్తుత సభ్యులను వారి పదవీకాలం పూర్తయిన తేదీ నుంచి ఆరు నెలల పాటు లేదా ప్రభుత్వ తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు, ఏది ముందు అయితే అది, పర్సన్–ఇన్–ఛార్జిగా కొనసాగించడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ద్వారా, ప్రస్తుత మేనేజింగ్ కమిటీలు తమ విధులను తాత్కాలికంగా కొనసాగించనున్నాయి. సహకార కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, హైదరాబాద్ పంపిన లేఖ (ఎల్ ఆర్. ఆర్సీ.నం 8719/2018–P–5, 2025 జూన్ 30 ) ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ పొడిగింపు వల్ల ఈ సంస్థల కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగనున్నాయి.

# ఘనంగా తీజ్ పండుగ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండలంలోని కుసుంబాయి తండాలో పశుసంపద, పిల్లలు క్షేమంగా ఉండాలని కోరుతూ గిరిజన మహిళలు, ప్రజలు ఘనంగా తీజ్ పండుగను జరుపుకున్నారు. గురువారం నాడు డప్పు చప్పుళ్ల మధ్య గిరిజన మహిళలు సంప్రదాయ పద్ధతిలో నవధాన్యాలను తలపై పెట్టుకుని తండా సమీపంలోని పచ్చిక బయళ్లకు వెళ్లారు. అక్కడ వారు సీత్లా మాతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించి నైవేద్యం సమర్పించారు. మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని సీత్లా మాతను మొక్కుకున్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ శ్రీను నాయక్, గీత, స్వాతి, సుష్మిత, అనుష, సంజన, రజిత, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** లష్కర్ సింగారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలపై ఆమె అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఈ రోజు ఎంతమంది రోగులను పరీక్షించారు, ఈ వివరాలను ఈహెచ్ఎంఐఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలా నమోదు చేశారని వైద్య అధికారి డాక్టర్ హైదర్ ను అడిగారు. అలాగే, ఈ–ఔషధీ పోర్టల్‌లో నమోదు చేసిన మందుల వివరాలు, సెంట్రల్ మెడికల్ స్టోర్ నుంచి అందుకున్న మందులు, వాటి పంపిణీ, మరియు స్టోర్‌లో నిల్వ ఉన్న మందులను ఆమె స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ టీబీ ముక్త్ అభియాన్‌లో ఎంతమందిని పరీక్షించారు, ఏ ఏ హై రిస్క్ గ్రూపుల వారిని పరీక్షించారు, వారి వివరాల నమోదు వంటి అంశాలపై ఆరా తీశారు. టీబీ హై రిస్క్ గ్రూపుల వారికి ఎక్కువ సంఖ్యలో స్క్రీనింగ్ నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో నమోదైన గర్భిణుల వివరాలు, వారికి అందుతున్న సేవలు, ప్రసవానంతర సేవలను కూడా ఆమె పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. 'డ్రై డే' కార్యక్రమం పట్ల ప్రజలను భాగస్వాములను చేస్తూ అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హైదర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా విద్యా శాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి

**◆ ఉపాధ్యాయ సంఘాల డిమాండ్**

**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మామిడి జ్ఞానేశ్వర్‌పై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాడు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) కె. సత్యనారాయణరెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ డీఈఓ జ్ఞానేశ్వర్ అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ)పై కులం పేరుతో దుర్భాషలాడటం, "తమాషా చేస్తున్నావా?" అని బెదిరించడం వంటివి హేయమైన చర్యలని ఖండించారు. జిల్లా విద్యాశాఖను ముందుండి నడిపించాల్సిన స్థాయిలో ఉండి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఏఎంఓ సుజన్ తేజను ఉద్దేశించి "రిజర్వేషన్‌లో ఉద్యోగం వచ్చింది కాబట్టి గ్రీన్ పెన్ను పట్టుకుంటే సరిపోతుందా?" అని అవమానపరిచేలా మాట్లాడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. అంతేకాకుండా, ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం, ఉపాధ్యాయులను భయాందోళనలకు గురిచేసే విధంగా ప్రవర్తించడం




పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇలా కుల నేపథ్యాన్ని కించపరిచే విధంగా, ఉపాధ్యాయులను అవమానపరిచే విధంగా ప్రవర్తిస్తున్న డీఈఓ జ్ఞానేశ్వర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్ఎంఏ, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, టీపీయూఎస్, ఎస్‌సీఎస్‌టీయూఎస్ వంటి ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్. రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, భోగేశ్వర్, తాటికాయల కుమార్, సుజన్ ప్రసాదరావు, గోవిందరావు, వెంకటరమణ, ఆచార్య ప్రద్యుమ్న, పరశురాములు, నర్సయ్య, ఎస్.ఎ. రవూఫ్, ఎస్. వెంకన్న, కె. రవీందర్, గుండు కరుణాకర్, నామోజు శ్రీనివాస్, వి. అరవింద్ కుమార్, కె. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# బేయర్ కంపెనీ 'బికోటా'పై రైతులకు క్షేత్ర ప్రదర్శన



**వరంగల్ వాయిస్, పరకాల:** నియోజకవర్గంలోని నడికుడా మండలంలో బేయర్ కంపెనీ కొత్త ఉత్పాదన అయిన 'బికోటా'పై గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 100 మంది రైతులు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో రైతులు తమ సాధారణ పద్ధతిలో సాగు చేసిన పొలాన్ని, బేయర్ కంపెనీ బికోటా వాడిన పొలాన్ని నేరుగా పరిశీలించారు. బికోటా వాడిన పొలంలో మోగి పురుగు ప్రభావం లేదని, పిలకలు అధికంగా పెరిగి, పచ్చదనం బాగా ఉందని రైతులు స్వయంగా చెప్పారు. అలాగే, బికోటా వాడిన పొలంలో వేరు వ్యవస్థ చాలా దృఢంగా ఉందని వారు తెలిపారు. ఈ నూతన ఉత్పత్తి వల్ల మోగి పురుగు నియంత్రణ చాలా ప్రభావవంతంగా ఉందని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరకాల మేనేజర్, సీసీఎం శివేష్ కుమార్ రెడ్డి, బికోటా వాడే విధానం, దాని పనితీరుపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు మండల కిరణ్, పీల్లెల శివసాయి, వంచనగిరి రమేష్ పాల్గొన్నారు. ఈ క్షేత్ర ప్రదర్శనను వీక్షించడానికి వివిధ గ్రామాల నుంచి రైతులు వచ్చారు.

# వాహనాల సమాచారం అందుబాటులో ఉండాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** నగరంలోని శానిటేషన్ వాహనాల కదలికలకు సంబంధించిన సమాచారం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం నాడు బల్దియా ప్రధాన కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, వాహనాల ట్రాకింగ్ నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పోతన, బాలసముద్రంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో చెత్తను తూకం వేయడానికి వేయింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శానిటేషన్ వాహనాల్లో ఎన్ని పనిచేస్తున్నాయి, ఎన్ని నిలిచిపోయాయి వంటి వివరాలు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలని, జీపీఎస్‌లకు సంబంధించిన మరమ్మతులను వెంటనే చేయించి, అవి పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, సెన్సార్లు ఏర్పాటు చేసి వాటిని ఐసీసీసీకి అనుసంధానం చేయాలని, ఫిల్టర్ బెడ్‌లలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు ఉండేలా చూడాలని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ మేనేజర్ రమేష్, ఐసీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రెడిట్ కార్డు మోసాలు

**◆ లక్షల రూపాయలు స్వాహా చేసిన మోసగాడి అరెస్ట్**

**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైమ్:** క్రెడిట్ కార్డుల ద్వారా ఎటువంటి కమిషన్ లేకుండా డబ్బులు ఇస్తానని నమ్మబలికి, బాధితుల నుంచి లక్షల రూపాయలు స్వాహా చేసిన మోసగాడిని హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి కంప్యూటర్, స్వైపింగ్ మెషిన్, రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మండలం, మడిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల అరుణ్ (31) అనే నిందితుడు 2023లో హనుమకొండలోని రాయపురలో 'భద్రకాళి డిజిటల్ సేవ షాప్' ప్రారంభించాడు. మొదట్లో ఆన్‌లైన్ అప్లికేషన్లు చేసేవాడు. తర్వాత ఇన్స్టాముద్ర, షాద్వాల్ పే యాప్‌లకు ఫీజు కట్టి డిస్ట్రిబ్యూటర్ ఐడీ తీసుకుని, కస్టమర్ల క్రెడిట్ కార్డులను స్వైప్ చేసి వారికి నగదు ఇచ్చేవాడు. దీనికిగాను వీసా కార్డులకు 1.8%, మాస్టర్ కార్డులకు 2.6%, బిజినెస్ కార్డులకు 4%, రూపే కార్డులకు 1.8% చార్జీలు వసూలు చేసేవాడు. నిందితుడు తన వద్దకు తరచుగా వచ్చే కస్టమర్లను తన వ్యాలెట్‌లో యాడ్ చేసుకుని, వారి క్రెడిట్ కార్డులలో బ్యాలెన్స్ ఉన్నప్పుడు ఫోన్ చేసేవాడు. తనకు వేరే పేమెంట్ చేయాల్సి ఉందని, వారికి ఎటువంటి చార్జీలు లేకుండా తానే వారి క్రెడిట్ కార్డుల బిల్లులు కడతానని నమ్మబలికేవాడు. ఆ విధంగా మోసపూరితమైన




మాటలతో వారి కార్డులు స్వైప్ చేసి, ఆ డబ్బును వేరే కస్టమర్ల కార్డుల పేమెంట్‌కు ఉపయోగించి 4% వరకు చార్జీలు తీసుకుని లాభపడేవాడు. తర్వాత తన బ్యాంక్ అకౌంట్ హోల్డ్ అయిందని, రెండు రోజుల తర్వాత కమీషన్ లేకుండా డబ్బులు ఇస్తానని నమ్మించేవాడు. దాదాపు ఏడాదిన్నర పాటు ఇలా నమ్మకంగా ఉంటూ కస్టమర్ల క్రెడిట్ కార్డు బిల్లులు కడుతూ, స్వైప్ చేస్తూ, సుమారు 28 లక్షల రూపాయలు వాడుకున్నాడు. ఈ డబ్బుతో తన పంట రుణాలు, అప్పులు తీర్చి, కుటుంబ సభ్యులకు కూడా సర్దుబాటు చేశాడు. కస్టమర్లు తరచుగా ఫోన్ చేయడంతో వారిని దాటవేయడం మొదలుపెట్టాడు. పరిస్థితి చేయిదాటడంతో కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్తే కస్టమర్లు మర్చిపోతారని భావించి షాపు మూసేసి విజయవాడ వెళ్లిపోయాడు. ఇటీవల తన షాపు వద్దకు వచ్చి ఖాళీ చేస్తుండగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. విచారించగా, నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని హనుమకొండ ఏసీపీ నరసింహ రావు అభినందించారు.



## పరదా సినిమా అందరినీ అకట్టుకుంటుంది

### నటి అనుపమా పరమేశ్వరన్ విశ్వాసం

'పరదా' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు– చెప్పారు. ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీ–మ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను అన్నారు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటు–న్నట్లు– చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.

## తనస్టైల్‌తో అదరగొట్టిన కూలీ...




### విలనిజం పండిరచిన అక్కినేనినాగార్జున


కథ కన్నా .. కథనంతో సాగించిన తీరు అద్భుతం రజనీకాంత్ సినిమా అంటే హైప్ సర్వసాధారణం. దానికి తోడు 'కూలీ' సినిమాలో విలన్‌గా చేసింది నాగార్జున. వీరిద్దరితోపాటు అమీర్‌ఖాన్, ఉపేంద్ర స్పెషల్ ఎట్రాక్షన్. ఇక తలైవా సినిమా అంటే అనిరుథ్ మ్యూజిక్‌లో ఏ రేంజ్‌లో రెచ్చిపోతాడో తెలిసిందే. ముఖ్యంగా బ్లాక్‌బస్టర్స్ ఖైదీ, విక్రమ్, లియోల తర్వాత లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన సినిమా. అన్నింటినీ మించి రజనీకాంత్‌ని లోకేష్ కనకరాజ్ డైరెక్ట్ చేసిన తొలి సినిమా. ఈ కారణాలు చాలు... 'కూలీ'పై అంచనాలు పెరగడానికి. ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'కూలీ' గురువారం థియేటర్లలోకి అడుగుపెట్టాడు. రజనీకనపిస్తే చాలు...కథ ఎలా ఉన్నా అభిమానులు సినిమా చూస్తారు. సైమన్(అక్కినేని నాగార్జు) పేరు మోసిన స్మగ్లర్. విశాఖ షిప్‌యార్డ్‌ని అడ్డాగా చేసుకొని తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. స్మగ్లగూడ్స్, బంగారం ఇల్లీగల్‌గా ఎగుమతీ, దిగుమతులు అతని వృత్తి. అతని అనుంగు అనుచరుడు దయాళ్ (సౌబిన్ షాహిర్). సైమన్ ఇల్లీగల్ యాక్టివిటీస్ అన్నీ ఇతని కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. మహాక్రూరుడు. ఇదిలావుంటే.. మరణించిన జంతువుల క్రిమేషన్ కోసం రాజశేఖర్(సత్యరాజ్) ఓ ఎలక్ట్రిక్ ఛైర్‌ని తయారు చేస్తాడు. ఇలాంటి ఛైర్ కారణంగా మంచితోపాటు– చెడు కూడా జరిగే అవకాశం ఉందంటూ ప్రభుత్వ ప్రతినిథులు అభిప్రాయపడతారు. దాంతో ఆ ఛైర్‌ని మార్కెట్‌లోకి తెచ్చేందుకు గవర్నమెంట్ పర్మిషన్ ఇవ్వదు. తన శ్రమంతా వృధా అయిపోతుందనుకొని రాజశేఖర్ బాధపడుతున్న సమయంలో అతనికి సైమన్ నుంచి కబురు వస్తుంది. తాను చంపిన శవాలను బూడిద చేసేందుకు ఆ ఛైర్ కావాలంటాడు సైమన్. సహకరించపోతే కూతుళ్లను చంపుతానని బెదిరిస్తాడు. దాంతో కుటుంబం కోసం తప్పక సైమన్‌తో చేయి కలుపుతాడు రాజశేఖర్. సైమన్ చంపిన శవాలను ఆ కుర్చీ సహాయంతో బూడిద చేస్తుంటాడు. తన కుమార్తె ప్రీతి (శ్రుతిహాసన్) రాజశేఖర్‌కు ఈ విషయంలో సహాయం చేస్తుంటుంది. ఇదిలావుంటే.. ఉన్నట్టుండి రాజశేఖర్ మరణిస్తాడు. ఆ మరణవార్త విన్న రాజశేఖర్ ప్రాణస్నేహితుడు దేవా(రజనీకాంత్) షాక్ అవుతాడు. రాజశేఖర్‌ది సహజ మరణం కాదని, అతన్ని కొట్టి చంపారని దేవాకు తెలుస్తుంది. అంతేకాక, రాజశేఖర్ కుమార్తెలు ముగ్గురూ కూడా ప్రమాదంలో ఉన్నారని దేవాకు తెలుస్తుంది. దాంతో తన స్నేహితుడి పిల్లలకు దేవా అండగా నిలుస్తాడు. అసలు రాజశేఖర్‌ని చంపిందెవరు? రాజశేఖర్ పిల్లల్ని దేవా ఎలా కాపాడాడు? అసలు ఈ దేవా ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ. ఒక సాధారణ కథా వస్తువుకు, చక్కని కథనాన్ని జోడిరచి, జనరంజకంగా చెప్పడానికి ప్రయత్నించాడు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ప్రథమార్థం ఆడియన్స్ ముందు కొన్ని ప్రశ్నలుంచి, ద్వితీయార్థంలో ఆ చిక్కుముళ్లను ఒక్కొక్కటిగా విప్పుకుంటూ సినిమాను ముగించాడు. రజనీకాంత్ క్యారెక్టరైజేషన్ నెక్ట్సలెవల్లో డిజైన్ చేశారు లోకేష్. తనది కాని సమస్యలోకి ఎంటరై, ప్రమాదాలతో ఆడుకుంటూ.. రాజశేఖర్(సత్యరాజ్) కుమార్తెలను కాపాడుకుంటూ వెళ్తున్న దేవాను మనం ఫస్టాఫ్‌లో చూస్తాం. సెంకాడాఫ్‌కు వచ్చే సరికి అసలది తన సమస్యే అని తెలుస్తుంది. అదేంటనేది ఈ కథలో కీ పాయింట్. అయితే.. సినిమాలోని కొన్ని సన్నివేశాలు కృతకంగా అనిపించినా... మొత్తం సినిమా అయితే ఆకట్టుకునేలాగే ఉంది. దేవాగా రజనీకాంత్ నటనకు అభిమానులు ఉర్రూతలూగిపోవడం ఖాయం. పవర్‌ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో మరోవైపు ఎమోషన్స్‌తో అదరగొట్టేశారు సూపర్‌స్టార్. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ యాక్షన్ సీక్వెన్స్‌లో వింటేజ్ తలైవాను చూసి తమిళ జనం ఊగిపోవడం ఖాయం. ఇక విలన్ సైమన్‌గా నాగార్జున ఆకట్టుకున్నారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన దేవా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ను సింపుల్‌గా మాటలతో సరిపెట్టేయడం నిరుత్సాహపరుస్తుంది. ఇక సైమన్ (కశగశసిషశ) పాత్రను ముగించిన తీరు.. చాలా సింపుల్‌గా తేల్చిపారేశారు.

MOVIE REVIEW

## ఇద్దరు హీరోల చిత్రం వార్-2

### హృత్రిక్‌తో పోటీపడి నటించిన ఎన్టీఆర్

ఈ ఏడాది ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న భారతీయ సినిమాల్లో 'వార్ 2' ఒకటి. హృత్రిక్ రోషన్ సినిమా అయినా, ఎన్టీఆర్ ఉండడంతో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ ఫ్రాంఛైజీలోకి ఎన్టీఆర్ రావడంతో తెలుగు వారికి మరింత ప్రత్యేకంగా మారింది. అత్యంత భారీ చిత్రం 'బ్రహ్మాస్త్ర తర్వాత అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ అద్భుతమనే చెప్పాలి. మాజీ ఏజెంట్ కబీర్ (హృతిక్ రోషన్) దేశం దృష్టిలో ఓ ద్రోహి. రా విభాగానికి చీఫ్ అయిన కల్నల్ సునీల్ లూథ్రా (అశుతోష్ రాణా)కి ఒకప్పుడు నమ్మిన బంటు–. అలాంటి కబీర్ రా కళ్లుగప్పి అజ్ఞాతంలో గడుపుతుంటాడు. ఓ కాంట్రాక్ట్‌లో భాగంగా జపాన్‌లో అత్యంత శక్తిమంతమైన ఓ వ్యక్తిని అంతం చేస్తాడు. ఆ తర్వాత అతనిపై కలి కార్టెల్ అనే ఓ అజ్ఞాతమైన అసాంఘిక శక్తి కన్నేస్తుంది. కబీర్‌ని తన కార్టెల్‌లో భాగం చేసుకుని భారతదేశాన్ని గుప్పెట్లోకి తీసుకోవాలనేది కలి పన్నాగం. ఆ కార్టెల్ మొదట కబీర్‌కి ఓ టాస్క్ అప్పజెబుతుంది. తనకి గాడ్ ఫాదర్ లాంటి సునీల్ లూథ్రాని అంతం చేయాలనేదే ఆ టాస్క్. చెప్పినట్టే ఆ పనిని పూర్తి చేస్తాడు కబీర్. దాంతో కబీర్‌ని ఎలాగైనా పట్టుకోవాలని రా కొత్త చీఫ్ విక్రాంత్ కౌల్ (అనిల్ కపూర్), భారత ప్రభుత్వం సోల్జర్ విక్రమ్ చలపతి (ఎన్టీఆర్) నేతృత్వంలో ఓ బృందాన్ని రంగంలోకి దింపుతుంది. ఆ బృందంలో లూథ్రా కూతురు వింగ్ కమాండర్ కావ్య లూథ్రా (కియారా అడ్వాణీ) కూడా ఒకరు. మరి కబీర్ కోసం విక్రమ్ బృందం మొదలుపెట్టిన వేట ఎలా సాగింది? కబీర్ దేశద్రోహిగా ఎందుకు మారాడు? అతనికీ, కావ్యకీ ఉన్న సంబంధం ఏమిటి? కబీర్... లూథ్రాని చంపడం వెనక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? కబీర్‌కి విక్రమ్ ఎవరో తెలిశాక ఏం చేశాడు? కలి కార్టెల్ వెనకున్న అజ్ఞాత శక్తులు ఎవరు? తదితర విషయాలు ఆసక్తికరంగా మలిచారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచీ ఈ కథలో హీరో ఎవరు? విలన్ ఎవరనే ప్రశ్నే ఎక్కువగా అభిమానుల నుంచి వ్యక్తమైంది. అయితే ఇది హీరో విలన్ల కథ కాదు, ఇద్దరు హీరోల కథ అని ఆరంభ సన్నివేశాలతోనే చెబుతూ సినిమాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఇద్దరు హీరోల పరిచయ సన్నివేశాలు విజిల్స్ కొట్టిస్తాయి. జపాన్‌లో హృతిక్ ఫైట్, నౌకలో ఎన్టీఆర్ యాక్షన్ ప్రథమార్థంలో కీలకం. కబీర్ కోసం సోల్జర్ విక్రమ్ వేట మొదలు పెట్టినప్పటి నుంచి అసలు సిసలు వార్ మొదలవుతుంది. వారిద్దరూ ఒకరికొకరు ఎదురుపడటం, ఆ నేపథ్యంలో యాక్షన్ సన్నివేశాలు థ్రిల్‌ని పంచుతాయి. ముఖ్యంగా స్పెయిన్‌లో సాగే ఛేజింగ్, విరామానికి ముందు ఆకాశంలో విన్యాసాలు కట్టిపడేస్తాయి. విరామానికి ముందు సన్నివేశాల్లో మలుపు ద్వితీయార్థంపై ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రథమార్థంలో యాక్షన్ హంగామానే ఎక్కువగా అనిపించినా, ద్వితీయార్థంలో కథలో భావోద్వేగ కోణాన్నీ ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. విక్రమ్‌కీ, కార్టెల్‌కీ మధ్య సన్నివేశాలు ద్వితీయార్థానికి హైలైట్. ఇవన్నీ ఒకెత్తయితే, పతాక సన్నివేశాలు మరో ఎత్తు. రా విభాగం దావోస్‌లో ఒక పక్క ప్రధానిని రక్షించడం, మరోవైపు విక్రమ్, కబీర్ కలిసి చేసే అంతిమ పోరాటం ప్రేక్షకుడిని లీనం చేస్తాయి. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలూ ఆకట్టుకుంటాయి. కథని ముగించిన తీరు కూడా మెప్పిస్తుంది. కబీర్ పాత్రలో హృతిక్ కనిపించడం కొత్త కాదు. 'వార్'కి కొనసాగింపుగా, ఆ పాత్రని అంతే సమర్థంగా ఇందులో పోషించాడు. యాక్షన్ హీరోగా ఆయన □`టసైల్, ఎన్టీఆర్‌తో కలిసి చేసిన పోరాటాలు, సలామ్ అనాలి పాటలో డ్యాన్స్‌లు ఆకట్టుకుంటాయి. ఎన్టీఆర్ యాక్షన్ అవతారం ఈ సినిమాకి మరొక ప్రధాన ఆకర్షణ. ఇందులోని విక్రమ్ పాత్రలో ఒదిగిపోయారు. కియారా అడ్వాణీ ఊపిరి ఊయలగా పాటలో తన అందంతో కట్టిపడేస్తుంది. అశుతోష్ రాణా, అనిల్ కపూర్, వరుణ్ బదోలా పాత్రలూ మెప్పిస్తాయి. సినిమా మొత్తం ప్రధానంగా హృతిక్, ఎన్టీఆర్ చుట్టూనే సాగుతుంది. దాంతో మిగిలిన పాత్రలకి పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు.






# ఉప్పొంగిన దేశ భక్తి

- నగరంలో 75 అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ
- వర్షంలోనూ ఉత్సాహంగా సాగిన యాత్ర

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతీ పౌరుడు దేశ భక్తిని చాటాలని, భారతీయుడిగా పుట్టడం ఒక వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం యువ మోర్చా, మహిళా మోర్చా ఆధ్వర్యంలో తిరంగా యాత్ర చేపట్టారు. పోచమ్మ మైదాన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 75 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంట రవికుమార్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు ఆదేశాలతో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం మన ఐక్యత కు నిదర్శనం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై మన జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

**భారీ జాతీయ పతాకం..**

నగరంలో చేపట్టిన తిరంగ యాత్ర జాతీయ సమక్యతను చాటింది. పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు 75 అడుగుల పొడవు ఉన్న జాతీయ జెండాను వేలాది మంది చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో నగరం దద్దరిల్లింది. దారి పొడవునా బాటసారులు, దుకాణ దారులు జెండా కనిపించగానే వందన సమర్పణ చేశారు. భారీ వర్షం సైతం లెక్కచేయకుండా వందలాది మంది యాత్రలో పాల్గొనడం విశేషం.

# ఖుష్ మహల్ లో జెండా ఆవిష్కరణ

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ ఖుష్ మహల్ లో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద డీసీపీలు అంకిత్ కుమార్, షేక్ సలిమా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణిలతో కలసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మైదాన సదుపాయాలు, వేదిక ఏర్పాటు, గ్యాలరీలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. సంబంధిత శాఖల అధికారులతో ప్రతి అంశాన్ని శ్రద్ధగా సమీక్షించి, సమర్థవంతమైన నిర్వహణకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర దినోత్సవం ప్రతి ఒక్కరికి గర్వకారణమైన రోజని, ఈ వేడుకల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొననున్న విద్యార్థులకు తాగునీరు, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యఅతిథులు కూర్చోవడం, శబ్ద వ్యవస్థ, జాతీయ జెండా ఆవిష్కరణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. వేదిక సమీపంలోని ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించిన కలెక్టర్ స్థానిక పోలీసు, ట్రాఫిక్ అధికారులతో చర్చించి తగిన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శుభం, డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, మున్సిపల్, పోలీసు ఉన్నతాధికారులు, విద్యుత్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్..**

వర్షాల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల, విపత్తుల నిర్వహణాశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి హైద్రాబాద్ నుంచి గురువారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అన్ని శాఖల అధికారులతో రివ్యూ చేసి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తప్పకుండ పాటించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు వారి పరిధిలోని బాధ్యతలను సజావుగా నిర్వర్తించాలన్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24/7 పని చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్‌కు 1800 425 3424, 9154252936 సమాచారం అందించాలాని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సమస్యలను తక్షణమే తెలియజేయాలని, అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డీపీఓ కల్పన, డీఏఓ అనురాధ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతమ్ రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ ఇన్ స్పెక్టర్ రవి, ఎస్డీఆర్ఫ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లలో కమీషన్ల వివాదం

- లబ్ధిదారుడిపై కాంగ్రెస్ నాయకుల దాడి
- ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితుడు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు కమీషన్ ఇవ్వలేదనే కారణంతో ఒక లబ్ధిదారుడిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ నాయకులు దాడి చేసిన సంఘటన పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో చోటు చేసుకుంది. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన బాధితుడు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన కన్నే కల్పన పేరు మీద ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, మొదటి విడతలో లక్ష రూపాయలు ఆమె అకౌంట్‌లో జమ అయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు, నాయకుడు రమేష్.. కల్పన భర్త దేవేందర్‌ను సంప్రదించారు. గ్రామంలో చెరువు పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే ఖర్చుల నిమిత్తం మొదటి విడత నుంచి రూ. 10 వేలు, మొత్తం నాలుగు విడతలకు కలిపి రూ.40 వేలు కమీషన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై దేవేందర్ 'ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లకు మీకు ఎందుకు కమిషన్ ఇవ్వాలి?' అని ప్రశ్నించడంతో వాగ్వాదం తీవ్రమైంది. దీంతో ఆగ్రహానికి గురైన రాజు, రమేష్ ఇద్దరు కలిసి దేవేందర్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపర్చారు. గాయాలపాలైన దేవేందర్‌ను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో ముక్కుకు సర్జరీ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపినట్లు బాధితుడు విలేకరులకు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవేందర్ వెల్లడించారు. ఈ దాడితో వడ్లకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

# కాంగ్రెస్ అంటేనే కరువు

**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక సంస్థ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం గీసుగొండ మండలం కొనాయిమాకుల గ్రామంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు నివాసంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎరువుల కొరతపై, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన సమయంలో పంటలకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీళ్లివ్వక.. కావాల్సిన ఎరువులు అందిచక పోవడంతో సొసైటీలలో కూర్చోలేక పోతున్నామని సొసైటీ చైర్మన్లు హరీష్ రావుకి తెలియచేశారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే కరువని.. రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని అన్నారు. రైతులకు అప్పుడూ, ఇప్పుడు అండగా బీఆర్ఎస్ ఉంటుందని తెలిపారు. వచ్చే వినాయక చవితి తర్వాత స్థానిక సంస్థ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలా ఉందని అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొట్టాలని యువతకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూమి అమ్మకంపై డీఎఫ్ఓ విచారణ

- స్థానిక అధికారులపై సీరియస్
- ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలంటూ ఆదేశం

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం, మెట్టుపల్లి గ్రామంలో అటవీశాఖ భూమి అమ్మకం పేరిట వరంగల్ వాయిస్ లో వచ్చిన వరుస కథనాలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ శాఖ అధికారులు సీరియస్ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి డీఎఫ్ఓ నవీన్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించిన భూముల్లో కలియ తిరిగారు. అక్కడ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆక్రమణ దారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూమిని ఆక్రమించిన వారు తమ పరపతిని ఉపయోగించి పైరవీలు చేసినప్పటికీ వారికి ఫలితం దక్కలేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com